

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - కడప : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నామని డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. ప్రజలు తమ అర్జీలు Meekosam.ap.gov.inలో నమోదు చేసుకోవాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను జిల్లా కేంద్రంతో పాటు మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించుకోవచ్చునన్నారు. డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9.30 నుండి 10 గంటల వరకు నిర్వహిస్తామని, ప్రజలు 08562-244437 ల్యాండ్‌లైన్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను విన్నవించుకోవచ్చునన్నారు.

అదనపు కార్మికుల ఆవేదన

- వేతనాలు అందక అవస్థలు
- చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ భారం
- కనీస వేతన అమలును విస్మరించిన కాంట్రాక్టర్లు
- పట్టించుకోని ప్రభుత్వం
- దిక్కుతోచని స్థితిలో కార్మికులు



దీక్షలు చేస్తున్న అడిషనల్, కోవిడ్-19 కార్మికులు

ప్రజాశక్తి - కడప అర్బన్

నగర పాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న కోవిడ్ - 19 , అడిషనల్ కార్మికులు కనీస వేతనాలు అందక దుర్భర జీవితాలను కొనసాగిస్తున్నారు. చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ భారంగా నెట్టుకొస్తున్నారు. పెరిగిన నిత్యావసర ధరలకు, వస్తున్న వేతనాలకు పొంతన లేకుండా పోయింది. కార్మికచట్టాల ప్రకారం కనీస వేతనం రూ.18,600 ఉండాలి. కలెక్టర్ ప్రొసీడింగ్స్ ప్రకారం రూ.17,800 ఇవ్వాల్సి ఉంది. కాని కాంట్రాక్టర్లు ఈ వేతనాలను కార్మికులకు ఎక్కడా అమలు చేయడం లేదు. ప్రస్తుతం నగర పాలక సంస్థలో పని చేస్తున్న కోవిడ్-19 కార్మికులు, అదనపు కార్మికులు కలిసి దాదాపు 540 మంది ఉన్నారు. వీరు నెలకు రూ.12వేలు మించి వేతనాలు తీసుకునే పరిస్థితి లేదు. జీతాలు పెంచమని అడిగితే వేధింపులు అధికమవుతాయి. 1,2 రోజులు రాకపోతే తొలగిస్తామని బెదిరింపులు. దీంతో కార్మికులు తక్కువ వేతనాలతోనే కాలం వెళ్లబుచ్చుతున్నారు. 2019-20 లేబర్ స్కేల్ ప్రకారం రోజుకు రూ. 400 ఉండేది. 2025-26 ఏడాది స్కేల్ ప్రకారం రూ.18,600 అమలు చేయాలి. కాంట్రాక్టర్లు కనీసవేతనాలు అమలు చేయడానికి సుముఖంగా లేరు. వీరిపై చర్యలకు ప్రభుత్వం సాహసించదు. దీంతో కార్మికులు చేసేది ఏమీలేక అరకొర వేతనాలతో కాలం వెళ్లబుచ్చుతున్నారు. కనీసం ఇఎస్ఐ, పిఎఫ్ కూడా అమలు చేయని పరిస్థితి నెలకొని ఉంది. ఎన్ని ఆందోళనలు, పోరాటాలు, దీక్షలు చేసినా అధికారులు, పాలకులు, కాంట్రాక్టర్లు నిమ్మకునీరెత్తిన చందాన వ్యవహరిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. కోవిడ్ - 19 సమయంలో కార్మికులను పొగడ్తలతో ముంచెత్తిన ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి నేడు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయని దారుణ పరిస్థితి. ప్రస్తుత కార్మిక చట్టాలను అమలు చేయకుండా, రద్దు చేసే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయి. ప్రభుత్వం కనీస వేతనాలు ఇవ్వని పక్షంలో ఆందోళన బాటపట్టేందుకు కార్మికులు సిద్ధమవుతున్నారు. కనీసవేతనాలు, ఇఎస్ఐ, పిఎఫ్, రెగ్యులర్ కోసం సిఐటియు అండతో ఆందోళన బాట పట్టేందుకు కార్మికులు సిద్ధమవుతున్నారు.

చాలీచాలని వేతనాలతో అవస్థలు



నగరపాలక సంస్థ పరిధిలో పని చేస్తున్న కోవిడ్-19, అడిషనల్ కార్మికులు చాలీచాలని వేతనాలతో అవస్థలు పడుతున్నాం. కుటుంబ పోషణ భారంగా మారింది. అప్పులు పుట్టే పరిస్థితి లేదు. కనీస వేతనాలు అందేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి. కార్మికులను, తమ కుటుంబాలను ఆదుకోవాలి

- జె.హరికృష్ణ, కోవిడ్-19 కార్మికుడు, నగర పాలకసంస్థ, కడప.

మొర ఆలకించే నాథుడే కరువు



కార్మికులకు కనీసవేతనాలు ఇచ్చి ఆదుకోవాలని ఆందోళనలు, నిరసనలు, దీక్షల రూపంలో ప్రభుత్వాలకు మొరపెట్టుకుంటున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కనీస వేతనం రూ.18,600 ఇవ్వాలని తాము అడుగుతున్నాం. ప్రస్తుత నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటాయి. కుటుంబ పోషణ భారమైంది.

- పి.పెంచలయ్య, కోవిడ్-19 కార్మికుడు, నగరపాలకసంస్థ, కడప.

కష్టానికి తగిన ఫలితం లేదు



తెల్లవారకముందే పనులకు వెళుతున్న తమ కష్టానికి తగిన ఫలితం లభించడంలేదు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దే కార్మికుల జీవితాల్లో వెలుగులు కరువయ్యాయి. రూ.12వేల వేతనం సరిపోక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం కనీస వేతనం కార్మికులకు అందేలా చూడాలని కోరుకుంటున్నాం.

- పి.లక్ష్మీదేవి, అడిషనల్ కార్మికురాలు, నగరపాలక సంస్థ, కడప.

వేతనాల కోసం ఎదురు చూపులు



కార్మికులకు పనిచేయించుకుంటున్న అధికారులు సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడం దుర్మార్గం. వచ్చే వేతనాలు అరకొరగా ఉన్నాయి. వాటిని నెలనెలా ఇవ్వకుండా 2,3 నెలలకు ఒకసారి ఇవ్వడం బాధాకరం. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించి కార్మికులను ఆదుకోవాలి.

- కె.వెంకటసుబ్బయ్య, అడిషనల్ కార్మికుడు, నగరపాలకసంస్థ, కడప.

కనీస వేతన అమలు కోసం పోరాటం



నగరపాలక సంస్థలో పని చేస్తున్న కోవిడ్-19, అడిషనల్ కార్మికులకు కనీసవేతనం అమలు చేయాలని సిఐటియూగా పోరాటాలు నిర్వహిస్తున్నాం. కార్మికులను కోవిడ్ సమయంలో పొగిడిన ప్రజా ప్రతినిధులు, పాలకులు కనీస వేతనాలు ఇవ్వమని అడిగితే పట్టించుకోవడం లేదు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను పోషించే కార్మికులకు 2 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడం దుర్మార్గం. సిఐటియు కార్మికుల పక్షాన పోరాటం చేస్తుంది.

- పి.వెంకటసుబ్బయ్య, సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి, కడప

ఎన్‌టిఆర్ వైద్యసేవల

మెరుగుదలకు పెద్దపీట

- ఆర్నెళ్లకోసారి ఆరోగ్యమిత్రల బదిలీ తప్పనిసరి
- రూ.ఐదు లక్షలతో వృద్ధులకు ఆయుష్మాన్ సేవలు
- జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ వి.బాలాంజనేయులు



ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎన్‌టిఆర్ వైద్యసేవల మెరుగుదల పెద్దపీట వేశాం. ఇందులో భాగంగా నెట్‌వర్క్ ఆస్పత్రుల ఆరోగ్యమిత్రలను ఆర్నెళ్లకోసారి బదిలీ చేస్తాం. నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి రోగులకు ఇబ్బందులు ఎదురైతే ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్, 104 కాల్‌సెంటర్, హెల్ప్‌డెస్క్, ఆరోగ్య మిత్రలను సంప్రదించాలి. రేషన్‌కార్డులు లేకపోవడం, ఆరోగ్యశ్రీ కార్డుల్లో పేర్లు నమోదు చేయకపోవడం వంటి సమస్యలు ఎదుర్కొనే రోగులకు సిఎంసి లెటర్ ద్వారా వైద్యసేవలకు అర్హత కల్పిస్తాం. దీంతోపాటు ఆయుష్మాన్ భారత్, వయోవృద్ధుల పథకంలో భాగంగా రూ.ఐదు లక్షల వరకు 70 ఏళ్లు నిండిన వృద్ధులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నాం. ఆయుష్మాన్ భారత్ పథకం కార్డులను ఆధార్ కార్డుతో ఇకెవైసి అప్‌డేట్ ప్రక్రియను వేగవంతం చేశామని పేర్కొంటున్న ఎన్‌టిఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ వి.బాలాంజనేయులుతో ముఖాముఖి...

ఎన్‌టిఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ హాస్పిటల్స్ ఎన్ని?

జిల్లావ్యాప్తంగా ఎన్‌టిఆర్ నెట్‌వర్క్ పరిధిలో 106 ఆస్పత్రులున్నాయి. ఇందులో ప్రయివేటు 43, పిహెచ్‌సి 51, సిహెచ్‌సి 07, జిజిహెచ్‌లు 02, జిల్లా ఆస్పత్రి 01, సైక్రియాటిక్ 01, ఏరియా ఆస్పత్రి 01 ఆస్పత్రులున్నాయి.

ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ కార్డుదారుల వివరాలు తెలపండి?

జిల్లాలో 4,87,035 మందికి ఆరోగ్యశ్రీ కార్డులను కలిగి ఉన్నారు. 2019 నుంచి నేటి వరకు రూ.971 కోట్ల మేరకు 4,78, 257 మందికి లబ్ధి చేకూరింది. కడప జిల్లావ్యాప్తంగా అత్యధికంగా ఆర్థోపెడిక్, గైనకాలజీ, కార్డియాలజీ, డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు ఎక్కువగా చికిత్సలు చేయించుకుంటున్నట్లు తెలుస్తోంది.

కార్డుల్లో పేర్లు లేని రోగుల పరిస్థితేమిటి?

రేషన్‌కార్డులు లేని, కార్డుల్లో పేర్లు గల్లంతైన వారికి ఎన్టీఆర్ వైద్యసేవలు వర్తించే ప్రయత్నం చేస్తున్నాం. దీని కింద చికిత్స తీసు కోవాలనుకుంటున్న రోగులకు సిఎంసి లెటర్‌ను అందించి ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆస్పత్రులకు సిఫారసు చేస్తాం.

ఆరోగ్యశ్రీ సేవల మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలేమిటి?

ఎన్‌టిఆర్ ఆరోగ్యశ్రీ వైద్యసేవల మెరుగుదలపై దృష్టి సారించాం. ఇందులోభాగంగా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న 92 మంది ఆరోగ్యమిత్రలను ఆర్నెళ్లకోసారి బదిలీ చేయనున్నాం. దీంతో ప్రయివేటు ఆస్పత్రుల్లో త్వరితగతిన వైద్యసేవలు అందించడానికి అవకాశం ఉంటుంది. సక్రమంగా వైద్యసేవలు అందని పక్షంలో రోగులు హెల్ప్‌డెస్క్, ఆరోగ్యమిత్ర, 104 కాల్‌సెంటర్లను ఆశ్రయించే సదుపాయం కల్పించాం.

ఆరోగ్యశ్రీకార్డుకు, పిఎంజెవై కార్డు మధ్య వ్యత్యాసం ఏమిటి?

జిల్లాలో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికీ ఆరోగ్యశ్రీకార్డు ఉంటుంది. పిఎంజెవై ప్రతి వ్యక్తికి ఆరోగ్య భరోసా కలిగించడానికి గుర్తింపు కార్డు ఉంటుందని సంగతిని గమనించాలి.

ఆయుష్మాన్‌భారత్ హెల్త్‌కార్డుదారుల వివరాలు చెప్పండి?

జిల్లాలోని 7,72,496 ఆయుష్మాన్‌భారత్ హెల్త్‌కార్డులను సర్వే చేపట్టడమైంది. ఆయుష్ భారత్ పథకంలో గుర్తింపు పొందిన దేశంలోని కార్పొరేట్ ఆస్పత్రిలో రూ. ఐదు లక్షల విలువ కలిగిన ఉచిత వైద్యసేవలను పొందవచ్చు. వీటితోపాటు జిల్లాలో1,60,292 మంది వయోవందన కార్డుదారులు ఉన్నట్లు గుర్తించాం. 2011 నుంచి దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వయోవందన కార్డుదారులు 13,639 మంది ఉన్నట్లు గుర్తించడమైంది.



సైక్లింగ్ చేస్తున్న ఎస్‌పి, పోలీసులు

సంపూర్ణ ఆరోగ్యానికి సైక్లింగ్ : ఎస్‌పి

ప్రజాశక్తి-కడప అర్బన్

శారీరక దృఢత్వం, సంపూర్ణ ఆరోగ్యానికి సైక్లింగ్ ఎంతో దోహదపడుతుందని ఎస్‌పి ఇ.జి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు నగర శివార్లలోని ఊటుకూరు సర్కిల్ నుంచి మౌంట్ ఫోర్ట్ స్కూల్ వరకూ 6 కి.మీ నిర్వహించిన సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సైక్లింగ్ సహజసిద్ధమైన వ్యాయామమని తెలిపారు. ప్రతి ఆదివారం పోలీసులు, ప్రజలు సైక్లింగ్ ను అలవాటుగా చేసుకుని శారీరక దృఢత్వం, ఆరోగ్యాన్ని కాపాడుకునే విధంగా చేయడమే కార్యక్రమ లక్ష్యమన్నారు. సైక్లింగ్ వల్ల గుండె, ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, ఒత్తిడిని తగ్గించడానికి, మానసిక ప్రశాంతతకు సాయపడుతుందన్నారు. క్రమం తప్పకుండా సైక్లింగ్ చేయడం వల్ల క్యాలరీలు ఖర్చయి బరువు తగ్గడానికి ఉపయోగపడుతుందన్నారు. రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సైక్లింగ్ సహాయపడుతుందని తెలిపారు. పోలీస్ సిబ్బందితో పాటు ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో కొద్ది సమయాన్ని శారీరక వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి రమణయ్య, ఎఆర్ డిఎస్‌పి కె.శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి ఎన్. సుధాకర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ దారెడ్డి భాస్కర్‌రెడ్డి, సి.కె దిన్నె సి.ఐ నాగభూషణ్, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్ రెడ్డి, ఆర్‌ఐలు, చిన్న చౌకు సిఐ ఓబులేసు, చెన్నూరు సిఐ కృష్ణారెడ్డి, కడప టూ టౌన్ సిఐ సుబ్బారావు, సి.కె దిన్నె ఎస్‌ఐ శ్రీనివాసుల రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ కానిస్టేబుల్ శిక్షణకు సన్నాహాలు .. ఇటీవల ఎంపికైన స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్ల(ఎస్‌సిటిపిసి)కు త్వరలో శిక్షణ ప్రారంభం కానున్న నేపథ్యంలో నగర శివార్లలోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రాన్ని (డిటిసి) ఆదివారం తెల్లవారుజామున ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా శిక్షణా కేంద్రంలోని వసతి ఏర్పాట్లను, తరగతి గదులను, కార్యాలయ గదులను, మైదానం, అంతర్గత రహదారులను, బాటిల్ అబ్స్టాకల్ పరికరాలను పరిశీలించారు. డిటిసి డిఎస్‌పి అబ్దుల్ కరీంకు పలు సూచనలు చేశారు. ఎస్‌పి వెంట డిటిసి డిఎస్‌పి, సిబ్బంది ఉన్నారు.

వైవీయూ పరిశోధక విద్యార్థికి డిఎస్‌సి

ఫలితాల్లో ఒకేసారి 3 ఉద్యోగాలు

ప్రజాశక్తి- కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పరిశోధక విద్యార్థి గంధం అశోక్ కుమార్ మెగా డిఎస్‌సిలో మూడు ఉద్యోగాలతో సత్తా చాటాడు. అనంతపురం జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ తెలుగులో 2వ ర్యాంక్, పిజిటి జోన్ - 4లో 9వ ర్యాంక్, టిజిటి జోన్ - 4లో 33వ ర్యాంక్ సాధించాడు. ఈయన నేషనల్ ఎల్జిబిలిటీ టెస్ట్ (నెట్) - జెఆర్‌ఎఫ్‌లో కూడా రాణించారు. ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అశోక్ కుమార్‌ను వర్సిటీ అధికారులు, విద్యార్థులు అభినందించారు.

కోదండరామాలయంలో పవిత్రోత్సవాలు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం పవిత్ర ప్రతిష్ట శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సీతాలక్ష్మణ సమేత శ్రీరాములవారి ఉత్సవర్లను యాగశాలకు వేంచేపు చేశారు. అనంతరం యాగశాలలో పవిత్రమాలలకు ఉపచారాలు నిర్వహించి ప్రదక్షిణగా సన్నిధికి వేంచేపు చేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ , ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుంకేసుల బాదుల్లా

దూదేకుల కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలి

-పొలిటికల్ జెఎసి వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకేసుల బాదుల్లా

ప్రజాశక్తి - కడప సిటీ : దూదేకుల కార్పొరేషన్‌కు రూ. 100 కోట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని నూర్‌బాష్ ముస్లిం దూదేకుల పొలిటికల్ జెఎసి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకేసుల బాదుల్లా, రాష్ట్ర ఉపాధ్యక్షులు పగిడాల పెద్దన్న డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకేసుల బాదుల్లా మాట్లాడుతూ 79 ఏళ్ల స్వాతంత్ర్య భారత దేశంలో తమ హక్కులు రాజ్యాంగం ప్రసాదించిన ఫలాలు పొందలేక పోతున్నామని ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 20 లక్షలు దూదేకుల సోదరులు ఉన్నారని కానీ, రాజకీయంగా ఒక ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ లేకపోవడం బాధాకరమన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఓటరుగా చూస్తున్నారే తప్ప తప్ప లీడర్‌గా చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2014లో చంద్రబాబు 5 ఎమ్మెల్యేలు 2 ఎంపీలు ఇస్తానని హామీ ఇచ్చారని, కనీసం అసెంబ్లీ గేటుకు కూడా తాకనివ్వలేదని వాపోయారు. తరువాత జగన్మోహన్‌రెడ్డి నేకమంది బిసిలకు అవకాశం ఇచ్చారని, తమకు అవకాశం వచ్చే సమయానికి ప్రభుత్వం మారిందని, 2024లో రాయలసీమ నడిబొడ్డున కడపలో దూదేకుల కార్పొరేషన్‌కు 100 కోట్లు ఇచ్చి రుణాలు అందిస్తామని, మైనార్టీలుగా శాశ్వత జిఒ ఇస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని పేర్కొన్నారు. లోకేష్ యువగళం పాదయాత్రలో అనంతపురంలో చట్టసభల్లో అవకాశం ఇస్తానని చెప్పి మాట తప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల సాధన కోసం కడప జిల్లా దూదేకుల పొలిటికల్ జెఎసి కార్యవర్గం ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులుగా నాగూరు కుళాయిప్ప, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సరిటాల ఫకృద్దీన్, జిల్లా యూత్ అధ్యక్షులుగా బాబా హుస్సేన్, ప్రధాన కార్యదర్శిగా చితకుంట బాబు, జిల్లా ఉపాధ్యక్షులుగా అబ్దుల్లా, మస్తాన్, సిద్దయ్య, రాజకులయప్ప, బెల్లం కొండ దస్తగిరి, జిల్లా కార్యదర్శులుగా దుర్గం సుభాన్ అలీ బాషా, రాయపాటి దస్తగిరిని ఏకగ్రీవంగా ఎన్నుకొని నియామక పత్రాలు అందుకున్నారు.

లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఎస్‌పి ఇ.జి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు కడప వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో లాడ్జిలను పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలు అరికట్టేందుకు పటిష్టమైన చర్యలలో భాగంగా ఎస్‌పి ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టారు. లాడ్జీల్లో ప్రతి గదిని క్షుణ్ణంగా తనిఖీ చేసి, బస చేసిన వ్యక్తుల వివరాలను పరిశీలించారు. కొత్త వ్యక్తులను ప్రశ్నిస్తూ వివరాలపై ఆరా తీశారు. అనుమానిత వ్యక్తుల వివరాలు సేకరించి నేర నియంత్రణకు పోలీసులు పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. లాడ్జీలలో బస చేసే వ్యక్తుల నుంచి ఆధార్ కార్డులు, ఇతర వివరాల కోసం సరైన రిజిస్టర్ నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. చట్ట విరుద్ధంగా ఎవరికీ గదులు ఇవ్వరాదని, లాడ్జి పరిసరాలు స్పష్టంగా కన్పించేలా తప్పనిసరిగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు లాడ్జిల్లో బస చేసిన సమయంలో పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. డార్మిటరీస్, లాడ్జిల్లో ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తావిచ్చినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో కడప వన్ టౌన్ ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్‌ను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

మండల కేంద్రంలోని జడ్‌పి హైస్కూల్ ఆవరణలో అధునాతన వసతులతో నిర్మించిన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్‌ను కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదివారం పరిశీలించారు. సెప్టెంబర్ 2న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో నూతన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్‌ను ఎస్‌పి ఇ.జి. అశోక్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కోసం ఏర్పాటు చేసిన ఆటోమేషన్ సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్‌కు సంబంధించి వంట సామాన్లు, ఇతర మౌలిక సదు పాయాలపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లపై ఎస్‌పితో చర్చించారు. ఆయన వెంట పాల్గొన్న కడప ఆర్‌డిఒ జాన్ ఇర్విన్, డిఇఒ షంశుద్దీన్, ఆగ్రోస్ డిఎం జోయల్ విజయ్ కుమార్, ఎస్‌ఎస్‌ఎ, సంబంధితశాఖల ఇంజినీరింగ్ అధికారులు, విద్యాశాఖ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలి

ప్రజాశక్తి-కడప అర్బన్ : యువకులు క్రీడల్లో రాణిస్తూ సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు అమీర్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం పోలీస్ క్రికెట్ గ్రౌండ్‌లో అజారుద్దీన్ ట్రోఫీ - 2025 ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లీగ్ పోటీలు నిర్వహించిన కడప నైట్ రైడర్స్ అధ్యక్షుడు యం.తారిఖ్ అలీ, వారి మిత్ర బృందానికి అభినందించారు. స్పాన్సర్లుగా వ్యవహరించిన పి.ఎస్.డిజైన్, స్టాక్ గ్రూప్, ఎం.ఎం.హాస్పిటల్, సంఘం డెంటల్, సలావుద్దీన్ జ్యువెలర్స్, మరి కొన్ని వ్యాపార సంస్థల యాజమాన్యానికి క్రీడలకు, క్రీడాకాలరుకు ప్రోత్సాహం ఇవ్వడం హర్షనీయమని తెలిపారు. టిడిపి నగర ఉపాధ్యక్షులు పి.మన్సూర్ అలీఖాన్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగుతూ రక్తదానం, సమాజ శ్రేయస్సు కోసం పని చేయాలని కోరారు. అజారుద్దీన్ ట్రోఫీ నిర్వాహకులు, కె.కె.ఆర్ అధ్యక్షుడు తారిఖ్ అలీ మాట్లాడుతూ ఫైనల్ మ్యాచ్‌కు విచ్చేసిన అతిధులు, ముఖ్య అతిథులకు, స్పాన్సర్లకు కృతజ్ఞతలు తెలిపారు. మెగా స్టార్స్ -XI , స్టైలిష్ స్టార్స్-XI మధ్య మ్యాచ్ నిర్వహించారు. మ్యాచ్‌లో మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన మెగా స్టార్స్ 13 పరుగులతో తమ అద్భుతమైన ఆట తీరుతో అజారుద్దీన్ ట్రోఫీ -2025 ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. ఛాంపియన్ జట్టుకు రూ.10 వేలు, రన్నర్ జట్టుకు రూ. 50 వేలు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో మాజీ రంజీ క్రికెటర్ పైడికాల్వ విజయ్ కుమార్, ఆంధ్ర ప్రీమియర్ లీగ్ ఆటగాడు జహీర్ అబ్బాస్ ,రాష్ట్ర టిడిపి మైనార్టీ ఉపాధ్యక్షులు జిలాన్‌తోపాటు రాష్ట్ర డాక్టర్స్ సెల్ అధ్యక్షులు డాక్టర్ నజిముద్దిన్, పి.ఎస్.డిజైన్ అధినేత ఇంతియాజ్ అహమద్, సిటీ మైనారిటీ సెల్ ఆద్యక్షుడు పఠాన్ ఖాజా పీర్, నాసర్ అహ్మద్ పాల్గొన్నారు.



క్రీడాకారులను అభినందిస్తున్న వి.ఎస్. అమీర్‌బాబు

మట్టి విగ్రహాలను ప్రతిష్టిద్దాం

ప్రజాశక్తి - కడప

వినాయక చవితి సందర్భంగా అందరూ వినాయక మట్టి విగ్రహాలను వాడి పర్యావరణాన్ని కాపాడుకుందాం అని టిడిపి తొగట వీర క్షత్రియ సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షులు మడక చక్రధర్, జనసేన పార్టీ నాయకులు జి.వి. రమణ, రాబిట్ ఫిట్నెస్ సెంటర్ చైర్మన్ మహేష్ పిలుపునిచ్చారు. హ్యాండ్స్ 4 యు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మట్టి వినాయకుని విగ్రహాలు ఉచితంగా పంపిణీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వినాయక మట్టి విగ్రహాన్ని ప్రతి ఒక్కరూ వాడి, పర్యావరణాన్ని కాపాడాలన్నారు. మట్టి గణపతి గట్టి సంకల్పం అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి పర్యావరణాన్ని కాపాడాలి అన్నారు. సంస్థ చైర్మన్ పట్టుపోగుల సుబ్బారావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో 40వ డివిజన్ ఇన్‌ఛార్జి కర్నాటి ఓబుల్ రెడ్డి, 32వ డివిజన్ ఇన్‌ఛార్జి అర్జున్, మల్లికార్జున రెడ్డి, సుబ్బారాయుడు, మురళీ, శ్రీనివాస్, సుబ్రమణ్యం పాల్గొన్నారు. **బద్వేలు :** పర్యావరణం పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరం రాబోవు వినాయక చవితికి మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించాలని పర్యావరణ కాలుష్య నివారణకు అందరం పాటు పడదామని బద్వేల్ అర్బన్ సిఐ లింగప్ప తెలిపారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను 'ప్రతిష్టిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం'అనే వాల్ పోస్టర్లను ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె.మస్తాన్ షరీఫ్, ఎస్.కె.ఆదిల్, పట్టణ నాయకులు సుధాకర్, ప్రసాద రెడ్డి, ఎస్.కె. ఖలీల్ పాల్గొన్నారు.

బ్రాహ్మణుల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి - కడప అర్బన్

బ్రాహ్మణ కుటుంబాలలో పేదబ్రాహ్మణులు అనేక సమస్యలు ఎదుర్కొంటూన్నారని, వాటి పరిష్కారం కోసం ప్రజాప్రతినిధులు కృషి చేయాలని బ్రాహ్మణ సమ్మేళనంలో నాయకులు డిమాండ్ చేశారు. కడపలోని శ్రీరాజరాజేశ్వరి దేవస్థానం ఆవరణలో నిర్వహించిన బ్రాహ్మణ సమ్మేళానికి బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షులు సూగురు రఘునా థరావు అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణ కుటుంబాలలో అనేక మందికి తల్లికి వందనం పథకం కింద ఆర్థిక సహాయం అందలేదని పేర్కొన్నారు. అటువంటి వారి సమస్యలు తమ దృష్టికి తేవాలనికోరారు. ఇంటి స్థలాలు లేక స్వంత ఇల్లు లేని వారు పూర్తి వివరాలు ఇస్తే అధికారులు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. రాజకీయాల్లో బ్రాహ్మణులకు గుర్తింపు ఇవ్వాలని, పార్టీ పదవులలో అవకాశం ఇవ్వాలని కోరారు. అర్చక సంఘం నాయకులు పిడతల గోపాలకృష్ణ మాట్లాడుతూ అర్చకులు ఎదు ర్కొంటున్న సమస్యలను సభ దృష్టికి తెచ్చారు అనంతరం నిర్వాహకులను బ్రాహ్మణులు సత్క రించారు. కార్యక్రమంలో . చంద్రమౌళి శర్మ, రఘు నాథరావు కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్, మాజీ డైరెక్టర్ ప్రసాదరావు, లాయర్ సురేష్, సాయి, శ్రీధర్ రావు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధి కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్

రెడ్డి సేవా సమితి వసతి గృహంలో చదివే విద్యార్థినులకు నైపుణ్య శిక్షణ అందించడం కోసం రెడ్డి సేవా సమితిలో యోగివేమన నైపుణ్యాభివృద్ధి కేంద్రం, గ్రంథాలయాలను కడప రెడ్డి సేవాసమితి ప్రధాన కార్యదర్శి లెక్కల కొండారెడ ఆధ్వర్యంలో ఆదివారం రెడ్డి సేవా సమితి భవనంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ చదివే విద్యార్థినులకు చదువు పూర్తవుతూనే ఉద్యోగం, స్వయం ఉపాధి వైపు నడిపించే లక్ష్యంతో ఈ సెంటర్‌ను ప్రారంభించామని తెలిపారు. ఈ సెంటర్‌ను అరబిందో ఫార్మ ఫౌండేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కంభం నిత్యానంద రెడ్డి, డైరెక్టర్ పి.శరత్ చంద్రారెడ్డి ఆర్థిక సహకారం అందించారని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. సభాధ్యక్షులుగా వ్యవహరించిన డాక్టర్ నాగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులను ఒక నిర్దిష్టమైన పనిని సమర్థవంతంగా చేసే దిశగా ప్రయాణింప చేయాలని పేర్కొన్నారు. ఆచార్య మాచిరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నైపుణ్యాలను మెరుగుపరచడం వల్ల విద్యార్థులకు ఎక్కువగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, వారికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యం, సామర్థ్యం పెంపొందించుకునేటందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ ఆవుల సుధాకర రెడ్డి డాక్టర్ రాసుపల్లి వీర సుదర్శన్ రెడ్డి, వైఎస్ఆర్ జిల్లా రచయిత సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, వెంకటరెడ్డి, రమేష్ రెడ్డి, ఆనంద కుమార్ రెడ్డి, శివన్నారాయణ రెడ్డి, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.


సైకిల్ తొక్కుతున్న పోలీస్ సిబ్బంది

సైకిల్ తొక్కడం అలవాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

సైకిల్ తొక్కడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని తద్వారా శారీరక దృఢత్వం, సంపూర్ణ ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందని పులివెందుల డీఎస్పీ మురళి నాయక్ తెలిపారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల మేరకు పట్టణంలో అర్బన్ పోలీస్ స్టేషన్‌లో సైకిల్ ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సైక్లింగ్ సహజసిద్ధమైన వ్యాయామమని తెలిపారు. ప్రతి ఆదివారం పోలీసులు, ప్రజలు సైక్లింగ్‌ను అలవాటుగా చేసుకోవడం వల్ల మానసిక ప్రశాంతతకు సాయపడుతుందన్నారు. తమ దైనందిన జీవితంలో కొద్ది సమయాన్ని శారీరక వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి సారించినప్పుడే కుటుంబం సంతోషంగా ఉంటుందన్నారు. పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ, రూరల్, ట్రాఫిక్ సీఐలు చాంద్‌బాషా, వెంకటరమణ, హాజీవల్లి, ఎస్‌ఐలు నారాయణ, విష్ణు నారాయణ, పోలీసులు పాల్గొన్నారు.

ముద్దనూరు : సైక్లింగ్ వల్ల శరీర దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందని సిఐ దస్తగిరి అన్నారు. ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆదివారం సిఐ దస్తగిరి ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సైక్లింగ్ సహజసిద్ధమైన వ్యాయామమన్నారు. రక్తపోటు, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబులళ్లు, కానిస్టేబుళ్ల, హోం గార్డులు పాల్గొన్నారు.


సైక్లింగ్ చేస్తున్న సిఐ దస్తగిరి, పోలీసులు

సెక్యూరిటీ గార్డ్స్‌కు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్‌కు పెండింగ్‌లో ఉన్న గత 5 నెలల వేతనాలు ఇవ్వాలని సిఐటియు పట్టణ గౌరవ అధ్యక్షులు జి.ఏసుదాస్, పట్టణ ఆప్కాస్ గౌరవ అధ్యక్షులు ఎ.వినయ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆదివారం వారు మాట్లాడుతూ జూన్‌లో స్కూల్స్ ప్రారంభించారని గుర్తు చేశారు. గత ఐదు నెలలుగా వేతనాలు రాక వారు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే తరుణంలో శానిటేషన్ పరిస్థితి అలానే ఉందన్నారు. సెక్యూరిటీ గార్డ్స్‌కు ఒక్క రోజు కూడా సెలవు ఇవ్వకపోవడం లేబర్ ఆక్ట్‌కు భిన్నంగా చేయడమేనని తెలిపారు. 365 రోజులు విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇందుకు సంబంధించిన సేవ సుప్రీం తదితర కాంట్రాక్టర్లు కార్మికుల వేతనాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. సెలవులు ఇవ్వకపోగా, పిఎఫ్, ఇఎస్‌ఐ, సక్రమంగా కట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా సెక్యూరిటీ గాడ్స్‌కు కొత్త అగ్రిమెంట్ ప్రకారం రూ.18,600 ఇవ్వాల్సి ఉండగా వీరికి కేవలం రూ.7,000 నుంచి రూ.8,000 మధ్యలో మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరమన్నారు. ఇలాంటి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీటన్నిటిపై సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. అప్పటికీ వేతనాలు రాకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడుతామని వారు హెచ్చరించారు. ఇందుకు బాధ్యత జిల్లా రెసిడెన్షియల్ అధికారులదే అన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు నాయకులు


ఫిల్టర్లలో వేస్తున్న కొత్త మోటర్‌ను పరిశీలిస్తున్న సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు

తాగునీటి సమస్య లేకుండా చేయడమే లక్ష్యం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె పంచాయతీలో తాగునీటి సమస్య లేకుండా చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పాపాగ్ని నదిలో వేస్తున్న తాగునీటి ఫిల్టర్లును సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు. కాలిపోయిన మోటర్ల స్థానంలో కొత్త మోటర్లను బిగించి సకాలంలో ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి వీధికి పాపాగ్ని నది నీటిని సరఫరా చేసేందుకు నదిలో ఫిల్టర్లు వేసినట్లు చెప్పారు. పంచాయతీలో పని చేసే వాటర్ స్కీమ్ సిబ్బంది కూడా తాగునీరు సరఫరా చేసిన సమయంలో ఆయా ప్రాంతాల్లోకి వెళ్లి ప్రజల నుండి తాగునీటిపై అభిప్రాయాలను తెలుసుకోవాలని చెప్పారు. వర్షాలు ఎక్కువగా కురవకపోవడంతో పాపాగ్ని నదిలో నీటి మట్టం తగ్గి ఫిల్టర్లలో నీరు తక్కువగా వస్తుండడంతో నీటి సమస్య తలెత్తుతున్నట్లు చెప్పారు. అయినప్పటికీ నీటి సమస్య రాకుండా ఎక్కువగా నిధులు తాగునీటి కోసమే ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట వైసిపి నేతలు కసిరెడ్డి ఆదినారాయణరెడ్డి, వార్డు మెంబర్ సునీల్, నగేష్, ఫిట్టర్ శివ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు : సిఐ

ప్రజాశక్తి - వేంపల్లె

వినాయక పండుగ సందర్భంగా గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని సిఐ నరసింహులు రౌడీ షీటర్లను హెచ్చరించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆదివారం సాయంత్రం ఆయన రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఘర్షణలకు పాల్పడిన, ప్రోత్సహించిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై గట్టి నిఘా ఉంటుందని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై పీడీ యాక్ట్ ఉపయోగిస్తామని పేర్కొన్నారు. ఎలాంటి గొడవలకు తావు ఇవ్వరాదన్నారు. వివాదాలకు దూరంగా ఉండి మంచి నడవడికను కలిగి ఉండాలని సిఐ సూచించారు.


రౌడీషీటర్లకు సూచనలిస్తున్న సిఐ నర్సింహులు

తహశీల్దార్ కార్యాలయం వదలని విఆర్‌ఒలు, సర్వేయర్లు

ప్రజలు సచివాలయాల చుట్టూ తిరగాల్సిందే - కలెక్టర్‌కు ఎమ్మెల్యే 'పుట్టా' ఫిర్యాదు చేసినా మారని తీరు



ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని విఆర్‌ఒలు, సర్వేయర్లు సచివాలయాల్లో అందుబాటులో ఉండకుండా ప్రతినిత్యం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయానికి పరిమితం అవుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామ పరిధిలోకి వెళ్లి బయోమెట్రిక్ ఫొటో హాజరు వేసుకొని తిరిగి వెళుతున్నారు. తహశీల్దార్ కార్యాలయంలో ఏమాత్రం పని లేనప్పటికీ నిత్యం కార్యాలయంలోనే అందుబాటులో ఉంటున్నారు. కొంతమంది విఆర్‌ఒలు ఏకంగా కార్యాలయానికి సమీపంలో అద్దెకు భవనాన్ని తీసుకొని ప్రయివేట్ కార్యాలయాన్ని నడుపుతున్నారు. సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటే డిమాండ్ ఉండదని, మండల కేంద్రంకు రైతులు వస్తే ప్రతి పనికి ఒక రేటును నిర్ణయించి వసూలు చేసుకోవచ్చు అనే విధంగా ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభం కావడంతో రైతులు బ్యాంకు రుణాల కోసం వన్ బి అడంగల్, విద్యార్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం సచివాలయాలకు రెవెన్యూ సిబ్బంది కోసం వెళుతున్నారు. ఈ సమయంలో వారు అక్కడ అందుబాటులో లేకపోవడంతో మండల కేంద్రానికి రావాల్సి వస్తున్నది. వివిధ పనుల కోసం వచ్చిన రైతుల వద్ద విఆర్వోలు ప్రతి పనికి ఒక రేటు నిర్ణయించి ఆన్‌లైన్ దరఖాస్తు దగ్గర నుండి అధికారుల సంతకాలు పూర్తి అయ్యేవరకు తామే చూసుకుంటామని ఒప్పందాలు కూడా చేసుకుంటున్నారని తెలుస్తోంది. విఆర్ ఒలు మార్గంలోకి రాని పేద రైతులు, న్యాయం కోసం వచ్చే వారిని మాత్రం నెలల తరబడి కార్యాలయం చుట్టూ తిప్పుకునే పరిస్థితి కనిపిస్తోంది. సచివాలయంలో కంప్యూటర్లు, ఇంటర్నెట్ వసతి ఉన్నప్పటికీ తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి విఆర్ఒలు పనులు చేసుకుంటూ కనిపిస్తున్నారు. గత నెలలో మైదుకూరులో నియోజకవర్గస్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించినప్పుడు స్వయానా ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ విఆర్ఒల పనితీరు సరిగా లేదని, ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ సందర్భంగా కలెక్టర్ రెవెన్యూ సిబ్బంది పనితీరు మార్చుకోవాలని సచివాలయ పని వేళల్లో కచ్చితంగా అందుబాటులో ఉండాలని, తహశీల్దార్ కార్యాలయానికి అత్యవసరం ఉంటే సాయంత్రం వేళలో మాత్రమే రావాలని ఆదేశించారు. అయినప్పటికీ వారిలో మార్పు రాలేదనే విమర్శలున్నాయి. బదిలీల్లో నూతనంగా వచ్చిన సర్వేయర్లు కూడా నిత్యం కార్యాలయంలోనే ఉంటున్నారు. రైతులను కార్యాలయం వద్దకే తిప్పుకుంటూ ప్రతి పనికి ఒక రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రెవెన్యూ సిబ్బందిని గ్రామ సచివాలయాల్లో అందుబాటులో ఉండేలా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రోబోటిక్ మోకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతం

విద్యాసాగర్ ఆసుపత్రి చీఫ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని మారుతినగర్‌లో ఉన్న విద్యాసాగర్ ఆసుపత్రిలో 500 రోబోటిక్ మెకాళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేయడం సంతోషంగా ఉందని ఆసుపత్రి చీఫ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ విద్యాసాగర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆసుపత్రి ప్రాంగణంలో కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విద్యాసాగర్‌రెడ్డి మాట్లాడుతూ 500 మంది జీవితాల్లో మార్పులు తెచ్చి, కదలికలను పునరుద్ధరించడంలో ప్రజల విశ్వాసాన్ని పొందామని తెలిపారు. బోన్, జాయింట్ కేర్‌లో తన అద్భుతమైన ప్రయాణంలో మరొక పెద్ద మైలురాయిని విద్యాసాగర్ ఆసుపత్రి అధిగమించిందని పేర్కొన్నారు. 15 సంవత్సరాలుగా ఎముకలు, కీళ్ల సంరక్షణలో విశేష సేవలందిస్తూ 7,500కు పైగా మోకీళ్ల మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. సాంకేతికతలో ఒక ముందడుగుగా నిలబడడమే కాకుండా రాయలసీమ వాసుల కీళ్లు, మోకాళ్ల సంరక్షణే కీలకంగా అత్యాధునిక వైద్య సేవలను అందించాలనే ఆసుపత్రి సంకల్పాన్ని మరింత బలపరిచిందని చెప్పారు. రాయలసీమలో జాయింట్ కేర్ కోసం ప్రపంచస్థాయి కోరి రోబోటిక్ సాంకేతికతను పరిచయం చేసిన మొదటి ఆసుపత్రిగా విద్యాసాగర్ ఆసుపత్రి నిలిచిందని పేర్కొన్నారు. రోబోటిక్ సాంకేతికతో వందశాతం కచ్చితత్వంతో రోగి శరీర నిర్మాణానికి సరిపడే ఇంప్లాంట్లను అమర్చడానికి అవకాశం కల్పిస్తుందని తెలిపారు. ప్రముఖ డయాబెటిక్ స్పెషలిస్టు డాక్టర్ శ్రీలక్ష్మి సేవలు మరువలేనివని చెప్పారు. రోబోటిక్ ద్వారా శస్త్రచికిత్స చేయించుకున్న వారు మాట్లాడుతూ శస్త్రచికిత్స తమకు పునర్జన్మగా భావిస్తున్నామని పేర్కొన్నారు. సాధారణ జీవితాన్ని తిరిగి ఆస్వాదిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ నాగమునిరెడ్డి, ఇంటాక్ కన్వీనర్ చిన్నపరెడ్డి, కడప లయన్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ రంగనాథ్‌రెడ్డి, సైకాలజిస్ట్ ఒ.వి.రెడ్డి, ప్రముఖ వైద్యులు, పెన్షనర్లు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ శ్రీలక్ష్మి

అర్జున్ ఆసుపత్రిలో ఉచిత వైద్యసేవలు

డాక్టర్ స్వప్నారెడ్డి, డాక్టర్ శిరీషా

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని కో-ఆపరేటివ్ కాలనీలో ఉన్న అర్జున్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో ఐయుఐ ఉచిత వైద్య శిబిరానికి మహిళల నుంచి విశేష స్పందన లభించిందని యాస్టర్ నారాయణాద్రి తిరుపతి, ఆసుపత్రి ఫర్టిలిటీ కన్సలెంట్, గైనకాలజిస్ట్ డాక్టర్ వై.స్వప్నారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం అర్జున్ ఆసుప్రతిలో ఉచిత ఐయుఐ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వప్నారెడ్డి మాట్లాడుతూ పెళ్లై పిల్లలు లేకుండా సమస్యలతో బాధపడుతున్న వారి కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించామని తెలిపారు. పిల్లలు పుట్టి ప్రమాదంలో చనిపోయిన వారికి మళ్లీ పిల్లలు కావాలనుకునే వారు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యాస్టర్ నారాయణాద్రి తిరుపతి నుంచి వచ్చామని అర్జున్ ఆసుపత్రి వారిని కలిసి ఇక్కడ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వైద్య పరీక్ష కోసం వచ్చిన వారికి ప్రత్యేక రాయితీలు కూడా ఇస్తున్నామని పేర్కొన్నారు. కొన్ని పరీక్షలు ఉచితంగా చేశామని తెలిపారు. అర్జున్ ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ శిరీషా మాట్లాడుతూ యాస్టర్ నారాయణాద్రి నుంచి డాక్టర్ స్వప్నా రెడ్డి కడపకు వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారని చెప్పారు. పిల్లలు లేనివారికి, చాలాకాలంగా పిల్లలు లేకుండా బాధపడుతున్న వారికి మంచి వైద్యం అందిస్తున్నారని పేర్కొన్నారు. ఐవిఎఫ్ అతితక్కువ ఫీజుతో సేవలు అందిస్తున్నారని తెలిపారు. పిల్లలు లేనివారికి అతితక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించేందుకు కడపకు వచ్చారని చెప్పారు.


ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్ స్వప్నారెడ్డి, డాక్టర్ శిరీషా

వైద్యశిబిరాలతో పేదలకు ఉపశమనం : సిపిఎం



వైద్యశిబిరం వద్ద సిపిఎం, సిఐటియు, ఐద్వా, డివైఎఫ్ఐ నాయకులు


ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

సిపిఎం, సిఐటియు, ఐద్వా, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక అమృతనగర్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైందని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. ఒలిస్టిక్ సహకారంతో ఉచిత వైద్య మెడికల్ క్యాంప్ నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అమృతనగర్‌లో దాదాపుగా 7000 పైగా జనాభా అంతా కూలి పని చేసుకునే పేదవారు నివసిస్తున్నారన్నారు. ఇక్కడ మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడంతో పేదలకు కొంత ఉపశమనం కలుగుతుందనే ఉద్దేశంతో హోలిస్టిక్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించామన్నారు. పలు పరీక్షలు చేయించామన్నారు. ఆపరేషన్లు అవసరం అనుకుంటే ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తి ఉచితంగా హోలిస్టిక్ హాస్పిటల్‌లో ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. ఇలాంటి మెడికల్ క్యాంపులను పేద ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. వైద్యశిబిరంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు బాబు, చెన్నారెడ్డి, సుబ్బారావు, ఏసు, ఐద్వా జిల్లా కార్యదర్శి ముంతాజ్ బేగం, ఐద్వా ప్రొద్దుటూరు కార్యదర్శి సర్వేశ్వరి, అధ్యక్షులు వెంకటసుబ్బమ్మ, రాములమ్మ, లక్ష్మీదేవి, ఝాన్సీరాణి, విజయ కుమారి, డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, అధ్యక్షులు చంటి, ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల కోసం ఏర్పాటు చేసే జాబ్‌మేళా ద్వారా ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పులివెందుల జడ్పీటీసీ మారెడ్డి లత పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శ్రీవీరాంజనీయ సర్వీస్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. కార్యక్రమాన్ని జడ్పీటిసి మారెడ్డి లత ప్రారంభించారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు వేంపల్లె గ్రామంలో జాబ్‌మేళా నిర్వహించినట్లు చెప్పారు. నిరుద్యోగుల నుండి మంచి స్పందన రావడం హర్షణీయమన్నారు. ఉద్యోగ నిర్వహణలో మంచి ప్రతిభ చూపి పదోన్నతి పొందాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబాన్ని బంగారు కుటుంబంగా చూసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు పి4 అనే కార్యక్రమంపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కూటమి ప్రభుత్వం విడుదల చేసిన డిఎస్‌సి ద్వారా చాలా మంది నిరుద్యోగులు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని పేర్కొన్నారు. జాబ్‌మేళాకు 80 మంది హాజరు కాగా 51 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని శ్రీవీరాంజనీయ సర్వీస్ ప్రతినిధి తెలిపారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన నిరుద్యోగ మహిళలు, టిడిపి మహిళా నేత సునీత, రజియా ఆధ్వర్యంలో జడ్పీటీసీ మారెడ్డి లతను సత్కరించారు. నారాయణ పాఠశాల యాజమాన్యం జడ్పీటీసిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, టిడిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు బాలస్వామిరెడ్డి, మహమ్మద్ ఇనాయతుల్లా, తెలంగాణ వలి, వేమకుమార్, డక్కా రమేష్, జబిబుల్లా, బాలకృష్ణారెడ్డి, శివ, డాక్టర్ కరీముల్లా, సయ్యద్ పీరా, షరీఫ్, గొటూరు నాగభూషణం, ఫయాజ్ పాల్గొన్నారు.


నియామక పత్రాలు అందజేస్తున్న జడ్పిటిసి మారెడ్డి లత

మెగా డిఎస్‌సి అమలు హర్షణీయం

ప్రజాశక్తి - వేంపల్లె

నిరుద్యోగుల కోసం 15 నెలలు ఆలస్యంగానైనా కూటమి ప్రభుత్వం తొలి సంతకమైన 16,347 ఉపాధ్యాయ పోస్టులకు చెందిన మెగా డిఎస్‌సిని అమలు చేయడం హర్షణీయమని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సూపర్‌సిక్స్‌లో మిగిలిన హామీలను కూడా కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. రూ.3వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారన్నారు. ఆడబిడ్డ నిధిలో భాగంగా 19 నుంచి 59 ఏళ్ల మధ్య వయసు ఉన్న ప్రతి ఆడబిడ్డకు నెలకు రూ.1,500 ఆర్థికసాయం చేస్తామని మేనిఫెస్టోలో, సూపర్‌సిక్స్ హామీలో కూటమి నాయకులు చెప్పారన్నారు. ఆడబిడ్డ నిధి హామీని కూడా అమలు చేయాలని కోరారు. బిసి నేస్తం, కాపు నేస్తం అమలు చేయాలని కోరారు.


సీతారాంపురం గ్రామం వద్ద బ్రిడ్జి కిందకు ప్రవహిస్తున్న నీరు

కుందూలో తగ్గుతున్న నీటి ప్రవాహం

ప్రజాశక్తి - చాపాడు

పది రోజులుగా ఉధృతంగా ప్రవహించిన కుందూ నీటి ప్రవాహం క్రమేపి తగ్గుతోంది. ఎగువ ప్రాంతాల్లో వరుసగా వర్షాలు పడడంతో నీటి ప్రవాహం నదిలో అధికంగా ఉండేది. అన్నవరం, అల్లాడుపల్లె గ్రామాల వద్ద బ్రిడ్జిలపై నీటి ప్రవాహం ఉండేది. 20వేల క్యూసెక్కుల వరకు నీటి ప్రవాహం గత వారంలో ప్రవహించేది. వర్షాలు తగ్గుముఖంతో నదిలో నీటి ప్రవాహం కూడా క్రమేపి తగ్గుతూ వస్తూ.. ప్రస్తుతం 9వేల క్యూసెక్కుల వరకు నీరు ప్రవహిస్తోంది. కుందూ పరిధిలో ఇప్పటికే రైతులు వరి, పసుపు, ఇతర పంటల సాగు చేపట్టారు. రేపటి వారంలో కుందూ నదిలో వినాయక ప్రతి మలను నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేపడుతున్నారు. నదిలో అధిక నీటి ప్రవాహం ఉంటే చాపాడు వద్ద నూతన బ్రిడ్జిపై నిమజ్జనానికి ఏర్పాట్లు చేపట్టాలనుకున్నారు. నదిలో నీటి ప్రవాహం తగ్గడంతో అన్నవరం, సీతా రామాపురం గ్రామాల వద్ద నిమజ్జనాలకు ఏర్పాట్లు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రెండుమూడు రోజుల్లో నీరు మరింత తగ్గే అవకాశం కనిపిస్తోంది.


సూచనలిస్తున్న ఎస్ఐ శివప్రసాద్

వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

వినాయక మండపాలు ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరిగా పొందాలని ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఉత్సవ కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోలీస్, విద్యుత్ తదితర శాఖలతో అనుమతి ఉండాలన్నారు. అశ్లీల నృత్యాలకు అనుమతులు లేవన్నారు. ఎవరైనా అతిక్రమించి ఏర్పాటు చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండపం పరిసర ప్రాంతాల్లో, నిమజ్జనం దగ్గర చిన్నపిల్లలను తీసుకెళ్లవద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. నిమజ్జనానికి వెళ్లే ప్రతి వాహనానికి రికార్డు ఖచ్చితంగా ఉండాలన్నారు. కులమతాలకు అతీతంగా పండుగను సంతోషంగా జరుపుకోవాలని కోరారు. వినాయక ఉత్సవాల అనుమతికి ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ప్రత్యేకంగా గణేష్‌ఉత్సవ్.నెట్ అనే వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేసిందన్నారు. దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఐ శివప్రసాద్ సూచించారు.

సహజ రంగుల మట్టి గణపతులనే ప్రతిష్ఠించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

సహజ రంగులతో తయారు చేసిన మట్టి గణేష్ విగ్రహాలను ప్రతిష్ఠించాలని, ప్రోత్సహించాలని జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మనవంతు బాధ్యతగా చేయూతను అందిద్దామన్నారు. వినాయకచవితి విశిష్ఠతను కాపాడేందుకు సమిష్టిగా కృషి చేయడం వల్ల ఒక గొప్ప మార్పును సాధించవచ్చునన్నారు. సహజ రంగులతో మట్టి విగ్రహాలను తయారు చేయడం స్వచ్ఛతకు చిహ్నమే కాకుండా ఖర్చు కూడా తగ్గుతుందన్నారు. ఆర్థికంగా కూడా కొంత వెసులుబాటు కలుగుతుందన్నారు. వినాయకుడి పండుగను పర్యావరణానికి అనుకూలంగా జరుపుకుందామన్నారు. మన చెరువులు, జల వనరులకు నష్టం కలిగించే వ్యర్థ పదార్థాల వినియోగం తగ్గిద్దామన్నారు. చెరువులు, సరస్సులు, జలాశయాలు, జీవరాశుల మనుగడ ముఖ్యమని వాటి సంరక్షణ మనందరి బాధ్యత అన్నారు. వినాయక విగ్రహాల తయారీలో కృత్రిమ రంగులు, విష పదార్థాల వినియోగం వలన జలవనరులు కాలుష్యానికి గురవుతున్నాయన్నారు. వీటి వలన జలవనరుల నాణ్యత తగ్గడంతోపాటు వృక్ష, జంతు జీవనంపై ప్రభావం పడుతుందన్నారు. మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను వినియోగిద్దామని భూపేష్‌రెడ్డి పిలుపునిచ్చారు.


భూపేష్ సుబ్బరామిరెడ్డి


శివాలయం కూడలి వద్ద పాడైన రోడ్డు

జాతీయ రహదారిపై గుంతలు

ప్రజాశక్తి - ముద్దనూరు

67వ జాతీయ రహదారిలో భాగంగా ఏర్పాటు చేసిన రోడ్డు నాసిరకంగా వేయడంతో రోడ్డు పూర్తిగా పాడైపోయింది. ముద్దనూరు-జమ్మలమడుగు రహదారిలోని శివాలయం వద్ద ఉన్న కూడలి మలుపులో రోడ్డుపై కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. ఈ దారిలో భారీ టిప్పర్లు అధిక లోడుతో తిరగడం వల్ల కొన్నాళ్లకే రోడ్డు పూర్తిగా దెబ్బతిందని ప్రజలు, వాహనదారులు విమర్శిస్తున్నారు. జాతీయ రహదారి అధికారుల పర్యవేక్షణలేని కారణంగా కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకుండా ఇష్టారాజ్యంగా రోడ్డు ఏర్పాటు చేశారని ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పాడైపోయిన రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.

ప్రభుత్వ భవనాలు.. పరుల పాలు

ఖాజీపేట : ప్రజల అవసరార్థం రూ.లక్షలు ఖర్చు చేసి నిర్మించిన ప్రభుత్వ భవనాలు పలుచోట్ల నిరుపయోగంగా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు తదితర భవనాలు నిరుపయోగంగా ఉండి పోయాయి. ఈ భవనాల గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణకు గురవుతున్నాయి. ఆయా గ్రామాలలో సొంత అవసరాలకు వినియోగించుకుంటున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. మండలంలోని పత్తూరు వద్ద బెస్త కాలనీలో సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన భవనం నిరుపయోగంగా ఉంది. ఈ భవనాన్ని స్థానికులు వారి అవసరాల కోసం వినియోగించుకుంటున్నారు. ప్రభుత్వ భవనాలకు సంబంధించి స్థలాలకు మంచి ధర పలుకుతుంది. దీంతో పలుకుబడి గల వ్యక్తులు వాటిని తమ ఆధీనంలో తీసుకొని అనుభవిస్తూ దర్జాగా ఆక్రమించేసుకుంటున్నారు. ఇలాంటి ఘటనలు మండలంలో చాలానే ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాలను, భవనాలను రక్షించాలని ప్రజలు కోరుతున్నారు.


నిరుపయోగంగా సాంఘిక సంక్షేమ శాఖ భవనం